


ఓలేటి శ్రీనివాసభాను


# ఆశీస్సులతో.....

రోహిణీ కార్తె... రేకుల షెడ్డు... మిట్ట మధ్యాహ్నం. ఆ వేడినీ, ఉక్కపోతనీ భరించలేం అనుకుంటే వాటికి తోడు- గర్ర్ర్ర్ర్- చెవుల్లో గింగుర్లు పెడతూ రేకుల షెడ్డులో పాతిక, ముప్పై కుట్టుమిషన్లు. కుడుతున్నది ఆడవాళ్లు... కానీ కుట్టు యంత్రాలుగా మారిపోయారు. ఆ టైలరింగ్ సెంటర్ని రైల్వే ఉమెన్స్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది.

అక్కడ....

కొలతల ప్రకారం కొందరు తానుల్ని కత్తిరిస్తుంటే, మరి కొందరు మిషన్ల మీద కుడుతున్నారు. ఇంకొందరు గుండీలూ, కాజాలూ కుడుతుంటే, సూపర్‌వైజర్లు ఎప్పటి కప్పుడు లెక్కలు రాసుకుంటున్నారు.





ప్రతీ మిషన్‌కీ ఓ వైపు కత్తిరించిన గుడ్డలు, మరో వైపు ఆకారం సంతరించుకున్న యూనిఫారాలు కుప్పలుగా పడున్నాయి. అవన్నీ రైల్వే యూనిఫారాలు. డ్రైవర్లూ, గార్డులూ, స్టేషన్ మాస్టర్లూ, టీసీలూ, ఇలా కేటగిరీల వారీగా రకరకాల రంగుల్లో, కొలతల్లో అక్కడ తయారవుతున్నాయి.

టైలరింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న వాళ్లంతా రైల్వే ఉద్యోగులు కాదు. కాంట్రాక్ట్ జీతగాళ్లు. 'జతకి ఇంత' అని చొప్పున 'పీస్‌మీల్' మజూరీ లభిస్తుంది. ఎన్ని జతలు కుడితే అంత రాబడి. అందుకే వాళ్లంతా ఉక్కపోస్తున్నా, ఊపిరాడకపోయినా, కాలంతో పోటీపడతారు. కీళ్లూ, కండరాలూ నొప్పెడుతున్నా టార్గెట్ పూర్తి చేస్తారు. మొండిగా పనిచేస్తున్నంత సేపూ తెలీదు గానీ, ఇంటికెళ్లాక తెలుస్తుంది. సంపాదన చాలదు. సంసారం గడవదు. రాత్రుళ్లు నిద్రపట్టదు. నొప్పులకు మందో మాకో మింగుతారు. తెల్లారగానే ఇంటి పనులు ముగించుకొని 'టైలరింగ్ సెంటర్'లో హాజరు వేయించుకుంటారు. గర్‌ర్‌ర్‌ర్ మంటూ కుట్టుమిషన్లవుతారు. సూదులూ, దారాలూ, కత్తెర్లూ, గుండీలుగా మారిపోతాయి. దళసరి ముతక తాన్లకి తమ బతుకుల్ని టాకా వేసుకుంటారు.

రెండుపూట్లా పని ఉంటుంది. కానీ ప్రతిఫలంతో ఒకే పూట గడుస్తుంది.

కమలమ్మ లాంటి వాళ్లకి అదే మహాభాగ్యం.

ఒంటరి బతుకులో కొండంత సాయం.

కష్టపడడం..... కష్టాలుపడడం... కమలమ్మకి కొత్తకాదు.

కష్టాల్లో పుట్టి పెరిగింది. కష్టాలే పెళ్లాడింది.


కమలమ్మ భర్త సుందరయ్య రైల్వేలో పార్సెల్స్ మోశాడు. పార్సెల్స్ క్లర్క్ స్థాయికి ఎదిగాడు. సుఖపడే రోజులొచ్చాయని కమలమ్మకి ధైర్యం చెప్పాడు. కానీ దేవుడు కష్టాల్ని పార్సెల్ చేసి పంపించాడు. సుందరయ్య ఓ మేజర్ విజిలెన్స్ కేసులో ఇరుక్కొన్నాడు. ఉద్యోగం పోయింది. ఆత్మహత్య చేసుకున్నాడు. కమలమ్మ నెత్తిన పిడుగుపడింది. ఓ కొడుకు, కూతురు. అప్పటికింకా చిన్న వాళ్లు. తనెలా బతకాలి? వాళ్లనెలా పెంచాలి? కమలమ్మ యూనియన్ వాళ్లని కలుసుకొంది. జీఎం గారి వరకూ వెళ్లింది. అర్జీల మీద అర్జీలు. మానవతా దృష్టితో నామమాత్రపు పింఛను మంజూరయింది. ఇల్లు గడవడానికి అది సరిపోదు. కమలమ్మ టైలరింగ్ నేర్చుకుంది. కుట్టుమిషన్ పెట్టుకుంది. పెద్దగా కలిసిరాలేదు. అప్పుడు రైల్వే ఉమెన్స్ ఆర్గనైజేషన్ వారి టైలరింగ్ సెంటర్‌లో యూనిఫారాలు కుట్టే పనిలో చేరింది. చన్నీళ్లకు వేన్నీళ్లు.

ఇద్దరు పిల్లల్నీ పెంచింది. చదివించింది. అమ్మాయి సరోజిని ఇంటర్ పాసవగానే దగ్గర సంబంధం చూసి, కలిగినంతలో పెళ్లి చేసి పంపించింది.

కొడుకు సత్యారావుని మాత్రం పట్టుబట్టి డిగ్రీ వరకూ చదివించి, రైల్వే అధికారుల కాళ్లు పట్టుకొని గూడ్సు గార్డు ఉద్యోగంలో వేయించింది. అమ్మయ్య గట్టెక్కానని కమలమ్మ ఊపిరిపీల్చుకుంది. కానీ సత్యారావుకి కళ్లు నెత్తికెక్కాయ్. ''ఒరేయ్ కళ్లు పేలిపోతాయ్'' తెలిసిన వాళ్లు సత్యారావుని మందలించారు. కానీ కుర్రాడు వింటేనా?

కమలమ్మ ఉంటున్న డివిజన్ హెడ్‌క్వార్టర్స్‌కి వందన్నర కిలోమీటర్ల దూరంలో ఓ స్టేషన్ ఉంది. దాన్ని ఆనుకుని పెద్ద మార్షలింగ్ యార్డ్ ఉంది. అక్కడ పనిచేస్తున్న సుబ్బారావు నెలలో కనీసం నాలుగైదు ట్రిప్పులు గూడ్సుబళ్లు తీసుకొని డివిజనల్ హెడ్‌క్వార్టర్స్‌కి వస్తాడు. అక్కడ 'గార్డు రన్నింగ్ రూమ్'లో రెస్ట్ తీసుకొని అట్నుంచి అటే వెళ్లిపోతాడు కానీ, అమ్మ-కమలమ్మని చూడ్డానికి రాడు. ఉన్నావా, తిన్నావా అని పలకరించడు. అలా చెయ్యకూడదని సత్యారావు భార్య షరతు పెట్టింది. ఆవిడ చాలా ఫాస్ట్! సూపర్‌ఫాస్ట్ ట్రైన్ డ్రైవర్ గారి కూతురు మరి! సత్యారావుతో ప్రేమలో పడింది. అతని కుటుంబ పరిస్థితిని తెలుసుకొంది. బట్టలు కుట్టుకొని బతికే కమలమ్మని అత్తగారూ అని పిలవలేనంది.

''అదీ... అదేంటంటే...'' అంటూ సత్యారావు నీళ్లు నమిలాడే తప్ప, ''రేపు మన పెళ్లయితే మా అమ్మకి ఆ అవసరం ఉండదు. మన దగ్గరే ఉంటుంది'' అని తెగేసి చెప్పలేకపోయాడు. కుట్టుమిషన్ చుట్టూ రద్దుముక్కల్లాంటి అమ్మ బతుకు



సత్యారావుకి కనిపించలేదు. పెళ్లి కాకముందే ప్రేయసికి చేరువయ్యాడు. పెళ్లయ్యాక అమ్మని పూర్తిగా మరిచిపోయాడు. ఏడాది క్రితమే సత్యారావుకు కూతురు పుట్టింది. కమ్మలమ్మ ఇంత వరకూ మనవరాల్ని చూడలేదు. కాదు సత్యారావు చూపించలేదు. కాదు కాదు సత్యారావు భార్య చూపించనివ్వలేదు.

గర్ర్ర్ర్ర్....

టైలరింగ్ సెంటర్‌లో కుట్టుమిషన్లు రొదచేస్తున్నాయి. ఎండ మండిపోతోంది. కమలమ్మ ఆయాస పడుతోంది. తెరలు తెరలుగా దగ్గుతోంది. కట్టుమిషన్‌ను ఆపి, తన కుర్చీకి తగిలించి ఉన్న గుడ్డ సంచీలోంచి మాత్రల పొట్లం తీసి, ఓ మాత్ర వేసుకొని, నీళ్లు తాగింది కమలమ్మ. మనిషి తెరిపిన పడి, మళ్లీ కుట్టుపని మొదలెడుతుంటే–సీనియర్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ గొంతు వినిపించింది.


''యూనిఫారాలు సరిగాలేవని, బఫూన్ల డ్రెస్సుల్లాగా ఉన్నాయని, స్టేషన్ మాస్టర్లూ, గార్డులూ, డ్రైవర్లూ కంప్లయింట్ చేస్తున్నారు. ఎగసన... దిగసన కాకుండా కొలతల ప్రకారం కుట్టండి. ఇప్పుడు కుడుతున్న బ్యాచ్‌లో కంప్లయింట్స్ వస్తే, మజూరీ కట్'' అంటూ సీనియర్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ హడావుడి చేశాడు. పూర్తయిన యూనిఫారాలను రాండమ్‌గా చెక్ చేసి, స్టేషన్లు, క్యాటగిరీల వారీగా, ఏర్పాటు చేయించి, ప్యాకింగ్ చేయించమంటూ సూపర్‌వైజర్లకు పురమాయించాడు. వాళ్లంతా ఆ పనిలో పడ్డారు. యూనిఫారాల్ని ప్యాకింగ్ సెక్షన్‌లోకి చేర్చారు. అక్కడ ప్యాకెట్ల దొంతర్లు పేరుకు పోతున్నాయి.

దూరం నుంచి వాటిని చూసిన కమలమ్మకి ఏదో ఆలోచన వచ్చింది. మిషన్ మీద పని ఆపి, ప్యాకింగ్ సెక్షన్‌లోకి వెళ్లింది. అక్కడ ఓ లాబ్‌లో తన కొడుకు సత్యారావు పని చేస్తున్న స్టేషన్ పేరు రాసి ఉంది. గూడ్సు గార్డుల యూనిఫారాల దొంతర వెతికితే ఓ కవర్ మీద సత్యారావు పేరు, కోడ్ నెంబర్ కనిపించాయి. కమలమ్మ కళ్లజోడు సవరించుకుంది. అక్షరాలు కూడబలుక్కుని చదివింది. వెంటనే, అక్కడ్నించి తన కట్టుమిషన్ దగ్గరకి వచ్చింది. కుర్చీకి తగిలించి ఉన్న గుడ్డ సంచీలోంచి న్యూస్‌పేపర్ చుట్టని బయటకు తీసి, దాన్ని చీ చెరుగులో దాచుకొని ప్యాకింగ్ సెక్షన్‌లోకి గుట్టుచప్పుడు కాకుండా వెళ్లింది. అక్కడ సత్యారావు పేరుతో ఉన్న కవర్‌లోని యూనిఫారాల జతల్ని బయటకు తీసి, వాటి మడతల్లో తను రహస్యంగా తీసుకొచ్చిన న్యూస్‌పేపర్ చుట్టను భద్రంగా దాచిపెట్టి, ఆ కవర్‌కి టేపుతో సీలు వేసి, ఏదో సాధించానన్న ఆనందంతో తన మిషన్ దగ్గరకు తిరిగి వచ్చింది కమలమ్మ.

ఆ న్యూస్‌పేపర్ చుట్టలో తన మనవరాలి కోసం కమలమ్మ కుట్టిన రంగురంగుల బుల్లి గౌన్ ఉంది. ఆ గౌన్‌ని ఉహల్లో మనవరాలికి తొడుగుతూ, ముద్దులు పెట్టి మురిసిపోయింది.

యూనిఫారంతో పాటు ఆ బుల్లి గౌన్ సత్యారావుకి చేరిందో లేదో తెలీదు కానీ, చేర్చమంటూ కమలమ్మ దేవుణ్ణి వేడుకుంది. చేరే ఉంటుందని బలంగా నమ్ముతోంది.

*



## 'పాఠశాల' టీచర్‌గా షాహిద్‌కపూర్

'తారే జమీన్ పర్' సినిమా బాలీవుడ్‌లో ఎలాంటి సంచలనం సృష్టించిందో మీకు గుర్తుండే ఉంటుంది. అందులో టీచర్‌గా అమీర్ చేసిన పాత్ర అందరినీ మెప్పించింది. అదే రూటులో షాహిద్ కపూర్ కూడా స్కూల్‌లో పిల్లలకు పాఠాలు చెప్పే టీచర్‌గా కనిపించబోతున్నాడు. త్వరలో వచ్చే 'పాఠశాల' సినిమాలో షాహిద్ పిల్లలకి పాఠాలు చెప్పే టీచర్‌గా మన ముందుకు రాబోతున్నాడు. 'తారేజమీన్‌పర్' సినిమాలో అమీర్ పాత్ర 'డైసెలిక్స్' అనే మానసిక వ్యాధితో బాధపడుతున్న ఒక స్టూడెంట్ చుట్టూ తిరిగితే, ఈ చిత్రంలో షాహిద్ పాత్ర చాలా మంది పిల్లలతో కలిసి ఉంటుంది. 'సినిమా మొత్తం 'విద్యా విధానం'తో ముడిపడి ఉంటుంది' అంటున్నారు కొరియోగ్రాఫర్ నుంచి నిర్మాతగా మారిన అహ్మద్‌ఖాన్. ఈ చిత్ర నిర్మాత ఆయనే!

'పాఠశాల' చిత్రానికి మిళింద్ యుకే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం మొత్తం కొన్ని ఇబ్బందుల మధ్య నలిగిపోతున్న విద్యార్థుల చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రానికి షాహిద్ కపూర్ ఎలాంటి పారితోషకం తీసుకోకపోవడం విశేషం. 'షాహిద్ నేనూ మంచి స్నేహితులం. ఎలాంటి విషయమైనా మేము షేర్ చేసుకుంటాం. నేను ఈ సినిమా గురించి చెప్పినప్పుడు షాహిద్ చాలా ఇంప్రెస్ అయ్యాడు. సినిమాలో అతని పాత్ర నిడివి తక్కువ ఉన్నప్పటికీ చెయ్యడానికి ఒప్పుకున్నాడు. తన మంచితనానికి ప్రతీకగా రెమ్యునరేషన్ తీసుకోకుండానే ఈ పాత్రను చేస్తానన్నాడు' అని చెప్పుకొచ్చారు ఖాన్.

షాహిద్‌తోపాటు ఈ సినిమాలోని స్టార్‌లు నానాపటేకర్, అయేషా టకియా కూడా ముఖ్యమైన పాత్రల్లో నటించబోతున్నారు.

'పిల్లలతో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. వాళ్లు చాలా సరదాగా, సీరియస్‌గా యాక్ట్ చేశారు. అతి సహజంగా కూడా కనిపించారు. ఈ సినిమా కచ్చితంగా ప్రతి ఒక్కరి గుండెలకు హత్తుకుంటుందనే నమ్మకం నాకుంది' అని చెప్పుకొచ్చారు ఈ చిత్ర నిర్మాత ఖాన్.

ఖాన్ మాత్రం చాలా బిజీగా ఉంటున్నారు. ఒకపక్క 'పాఠశాల' నిర్మాణం చూసుకుంటూనే ఇంకో పక్క అమీర్ నటిస్తున్న 'గజినీ' చిత్రానికి కొరియోగ్రఫీ చేసే పనిలో నిమగ్నమయ్యారు. గజినీలో 'గుజరీష్' అనే పాటను నమీబియాలో చిత్రీకరించారట. ఆ పాటకు స్టెప్పులివ్వడం ఎంతో అనుభూతిని ఇచ్చిందంటున్నారు ఖాన్.